క్లుప్తంగా

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



తిరువూరు: తిరువూరు నుంచి జయంతి గ్రామానికి తరలిస్తున్న రేషన్ బియ్యం లోడుతో ఉన్న మినీ వ్యానును పోలీసులు మంగళవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. తిరువూరు నుంచి 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు పట్టణ శివారులో నిలిపి తనిఖీ చేశారు. జయంతి గ్రామానికి చెందిన కాజా సత్యనారాయణ ఈ బియ్యం కొనుగోలు చేసినట్లు తమ విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. బియ్యంతో సహా వాహనాన్ని పోలీసుస్టేషనుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



తిరువూరు: గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్ కంప్యూటర్ వితరణగా ఇచ్చారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ శిక్షణ ఇచ్చే నిమిత్తం అదే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు రాంప్రదీప్ రూ.50 వేల విలువైన కంప్యూటర్‌ను ప్రధానోపాధ్యాయుడు సాయి రాంకు అందజేశారు. రాంప్రదీప్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



ఆగిరిపల్లి: తాడేపల్లి చొప్పరమెట్లలో కోటేశ్వరరావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి జన్మదినంను పురస్కరించుకొని స్వామివారికి పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు అయ్యప్ప స్వామి గీతాలు ఆలపించారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదానం చేశారు. పసుపులేటి అనూష్, పల్లగాని వెంకట కోటేశ్వరరావు , సింహాద్రి శ్రీనివాసరావు, పల్లగాని శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం



మైలవరం: రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట పరిధిలో మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడిలో నూజివీడు మండలం సిద్ధార్థ నగర్‌కు చెందిన లావూరి గోపి, భరోత్ చిన్నిలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ జోస్యుల శ్రీనివాస్ తెలిపారు. వీరు బైక్‌పై సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారికి బెల్లం సరఫరా చేస్తున్న నూజివీడుకు చెందిన కొల్లా మల్లికార్జునరావు, ఇతని వద్ద సారా కొనుగోలు చేసే ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాకు చెందిన లావూరి శివపై కేసు నమోదు చేశామని, అదుపులోకి తీసుకుంటామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం మైలవరం కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ వారికి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు



ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల అభివృద్ధికి అందరి ఆదరణ అవసరమని హెచ్‌ఎం లోకరాజు అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు సురేష్, ఐఈఆర్ టీచర్లు డీఎంవీ లక్ష్మీనారాయణరావు, నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రియల్' కష్టాలు

- అనధికార లేఅవుట్లలో ప్లాట్ల విక్రయాలు
- ఇల్లు కట్టుకునేందుకు అభ్యంతరాలు
- అదనపు ఫీజులు చెల్లిస్తేనే ఇంటి ప్లానుకు ఆమోదం
- ప్లాట్ ఖర్చు కంటే అదనపు వ్యయమే అధికం



తిరువూరులో కనీస సౌకర్యాలు లేని రియల్ ఎస్టేట్ వెంచర్

తిరువూరు: పేద, మధ్య తరగతి వర్గాలు తమ సొంతింటి కల నెరవేర్చుకునేందుకు రియల్ ఎస్టేట్ వెంచర్లలో కొనుగోలు చేసిన ఇళ్ల ప్లాట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. తిరువూరు పట్టణంలో పలువురు లబ్ధిదారులు అనధికారిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు రుణాలు తీసుకుని కొనుగోలు చేసిన ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకుందామని నగర పంచాయతీకి దరఖాస్తు చేస్తే ఈ ప్లాట్లకు అనుమతి లేదని తిరస్కరిస్తున్నారు.

భవిష్యత్ అవసరాల కోసం కొనుగోళ్లు..

తిరువూరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు వేసిన వెంచర్లలో కనీస సదుపాయాలు కల్పించకపోయినా 3, 4 సెంట్ల విస్తీర్ణం కలిగిన ప్లాట్లను భవిష్యత్ అవసరాల కోసం పలువురు కొనుగోలు చేశారు. వీరికి రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ప్లాట్లను దొడ్డిదారిన రిజిస్ట్రేషన్ చేసి చేతులు దులుపుకున్నారు. వెంచర్లలో రోడ్లు, వీధి లైట్లు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోగా, సామాజిక అవసరాల కోసం నగర పంచాయతీకి అప్పగించాల్సిన స్థలాలను సైతం అక్రమంగా ఇతరులకు విక్రయించేశారు. పట్టణ పరిధిలో సుమారు 15 రియల్ ఎస్టేట్ వెంచర్లలో నిబంధనలు పాటించలేదని గుర్తించిన నగర పంచాయతీ అధికారులు ఇటీవల ఆ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని, వాటికి అనుమతులు లేవని బహిరంగ ప్రకటన ఇచ్చారు. వీరిలో ఒకరిద్దరు నిర్వాహకులు మాత్రమే తమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకున్నారు. కొన్ని వెంచర్లలో కనీసం రోడ్లు కూడా నిర్మించకపోగా, పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండి ఉండటంతో కొనుగోలు దారులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఆంక్షలు

అనధికారిక లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకునేందుకు నగర పంచాయతీ అనుమతులు మంజూరు చేయడం లేదు. వెంచర్ నిర్వాహకులు కనీస వసతులు కల్పించకపోగా నగర పంచాయతీకి రోడ్లు, సామాజిక స్థలం రిజిస్ట్రేషన్ చేయనందున అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని నగర పంచాయతీ అధికారులు ఇళ్ల ప్లాన్లను తిరస్కరిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు దళారులు రంగప్రవేశం చేసి పురపాలక శాఖకు రియల్ ఎస్టేట్ వెంచర్ల యజమానులు చెల్లించాల్సిన 14 శాతం డెవలప్‌మెంట్ చార్జీలతో పాటు 33 శాతం అపరాధ రుసుంను ప్లాట్ల కొనుగోలు దారులతో కట్టించి ప్లాన్ అనుమతులు ఇప్పిస్తున్నారు. పట్టణంలోని కోకిలంపాడు రోడ్డులో గత ఐదేళ్లలో ఇళ్లు నిర్మించుకున్న పలువురు రాజకీయ ప్రముఖులకు కూడా నగర పంచాయతీ ప్లాన్ అనుమతిని నిరాకరించింది.

చర్యలు తీసుకుంటున్నాం



అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచిస్తున్నాం. ఇప్పటికే వెంచర్లు వేసి కనీస సదుపాయాలు కల్పించక, నిబంధనల మేరకు నగర పంచాయతీకి రోడ్లు, కామన్ స్థలాలు రిజిస్ట్రేషన్ చేయని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– లోవరాజు, నగర పంచాయతీ కమిషనర్

అసలు కంటే అదనపు ఖర్చే ఎక్కువ

అనధికారిక లేఅవుట్లలో ఇళ్ల స్థలాల కొనుగోలు కంటే ప్లాన్ అనుమతి పొందడానికి చెల్లించే రుసుంలు ఎక్కువగా ఉంటున్నాయని పలువురు ప్లాట్ల యజమానులు వాపోతున్నారు. లేఅవుట్లను ఆర్భాటంగా ప్రారంభించి, ఆకర్షణీయమైన బ్రోచర్లతో ప్రచారం చేసి, ప్రముఖులతో వాటిని ప్రారంభింపజేసి ప్లాట్లను అమ్ముకుంటున్న రియల్టర్లు.. వాటిని నియమ నిబంధనల మేరకు అభివృద్ధి చేసి నగర పంచాయతీకి అప్పగించకపోవడంతో వెంచర్ల యజమానులు చెల్లించే రుసుంల భారం ప్లాట్ల కొనుగోలు దారులపై పడుతోంది. పట్టణంలో మొత్తం 20కి పైగా రియల్ ఎస్టేట్ వెంచర్లుండగా 9 వెంచర్లకు అనుమతులు ఇంతవరకు రాలేదు. మరికొన్ని కోర్టు కేసుల్లో పెండింగులో ఉన్నాయి.

వేగంగా, సమర్థవంతంగా రీసర్వే

తహసీల్దార్ రాజ్‌కుమార్



ముసునూరు: భూముల శాశ్వత సరిహద్దు సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన రీసర్వేను వేగంగా, సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన కొర్లగుంట శివారు తాళ్లవల్లిలో రీసర్వే పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ భూముల సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను చూపే విధంగా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామంలో మొత్తం సరిహద్దు నిర్దేశకాలు 83 కాగా, 10 పూర్తయ్యాయని, బ్లాక్ సరిహద్దులు 76 కాగా 10 పూర్తి చేశామని చెప్పారు. రీసర్వే ముగిసిన అక్కిరెడ్డిగూడెంలో సందేహాల నివృత్తి కోసం భూ యజమానులకు 9(2) నోటీసులు జారీ చేశామని చెప్పారు. అనంతరం కాట్రేనిపాడులో 15, 20, 35 నంబర్ల రేషన్ దుకాణాల్లో స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమాల్లో డీటీ పురుషోత్తమ శర్మ, వీఆర్‌ఓ మణీంద్ర, మండల సర్వేయర్ సురేష్, సచివాలయ సర్వేయర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు అల్లాడ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న రచయితల సంఘ సభ్యులు

తిరువూరు: తన రచనల ద్వారా తెలుగు భాషకు సేవ చేసిన రచయిత అల్లాడ నారాయణరావు చిరస్మరణీయుడని అభ్యుదయ రచయితల సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య అన్నారు. అల్లాడ నారాయణరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో రాజుపేటలో మంగళవారం నిర్వహించారు. తెలుగు భాషలో తెనాలి రామకృష్ణ, ప్రభుత్వం కళ్ళు మూసుకోలేదు, ఆహుతి, కర్ణ హృదయం, భరత శపథం, రావణ పరితాపం, అశ్వత్థామ హతః, అప్పాజీ అంతిమ యాత్ర, మొండోడు, మా భారతేతిహాసం, కర్ణుని పాత్ర – వ్యక్తిత్వం, త్యాగరాజ స్వామి చరిత్ర తదితర గ్రంథాలు అల్లాడ రచనా శైలికి నిదర్శనమన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 8వ తరగతి తెలుగు ఉపవాచకం కోసం నారాయణరావు రాసిన మణిపూసలు, దూరదర్శన్ సప్తగిరిలో తిరువూరు కళాకారులు ప్రదర్శించిన జ్ఞానోదయం నాటక రచయితగా నారాయణరావుకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చాయన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుడిగా విద్యార్థులకు తెలుగు భాషపై మక్కువ పెంచిన ఆయన విద్యార్థులతో నాటకాలు ప్రదర్శింపజేశారని వివరించారు. నారాయణరావు చిత్రపటానికి తిరువూరు రచయితల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉయ్యూరు అనసూయ, రేపాక రఘునందన్, కార్యదర్శులు ఈడే భరతకుమారి, రాంప్రదీప్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌ను రద్దు చేయాలని వినతి

తిరువూరు: పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తల్లిదండ్రులకు, విద్యా కమిటీ సభ్యులకు అవగాహన కల్పించకుండా తిరువూరు మండల విద్యాశాఖాధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. శ్రీను, పి. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై గ్రామ పెద్దలతో చర్చించడం, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడంలో ఉదాసీన వైఖరి అవలంబిస్తున్న తిరువూరు మండల విద్యాశాఖాధికారి–2 రామకృష్ణ ఏకపక్ష నిర్ణయాలతో వివాదాలకు తావిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులతో అమర్యాదకరంగా మాట్లాడుతున్న రామకృష్ణపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ఆదర్శ పాఠశాలగా పరిగణించి ప్రస్తుతం బేసిక్ ప్రైమరీగా మారుస్తున్న తమ పాఠశాల గురించి, ఆ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు కలిగే నష్టాల గురించి మాట్లాడేందుకు వెళ్లిన తిరువూరు చింతలకాలనీ ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఎస్. లక్ష్మణరాజుకు సరైన సమాధానం చెప్పకుండా ఎంఈఓ–2 చులకనగా మాట్లాడారని ఆరోపించారు. ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి పరస్పర వివాదం జరగడానికి ప్రధాన కారుడైన ఎంఈఓ–2 రామకృష్ణ గతంలో కూడా పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుని సస్పెన్షన్‌కు గురైన విషయం అధికారులు గుర్తించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఎంఈఓను ప్రశ్నించిన ఉపాధ్యాయుడిపై విధించిన అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్‌చేశారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ కొనసాగించాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు, ఇంజినీరింగ్ కార్మికులకు 36 జీఓ మేరకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నందిగామ అధ్యక్షుడు బి.అప్పారావు, కార్యదర్శి జి.సురేష్, ఉపాధ్యక్షులు దేవుళ్లు, రమణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేంకటేశ్వరుని వసంతోత్సవం



చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు



కోనేరులో స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదవ రోజు మంగళవారం స్వామి వారికి వసంతోత్సవం, చక్రతీర్థం, కలశ స్నపనం, మహానివేదనం, పూర్ణాహుతి, ధ్వజారోహణ కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో ఉత్సవమూర్తులను కొండపై నుంచి ప్రత్యేక రథంలో ఊరేగింపుగా తీసుకువచ్చి కొండ కింద ఉన్న స్వామి వారి కోనేరులో ప్రత్యేక పూజల అనంతరం వసంతోత్సవం జరిపారు. భక్తులు, అర్చకులు రంగులు చల్లుకుంటూ చక్రతీర్థం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏసీ ప్రసాద్, సిబ్బంది రుక్మందరావు, వెంకటేశ్వరరావు, శోభనాద్రి, రామకృష్ణ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

తిరువూరు: గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల బకాయిలపై విధించిన వడ్డీపై రాయితీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో పన్ను చెల్లింపునకు సైతం 5 శాతం రాయితీ కల్పించినందున ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పనిసరి

నూజివీడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని నూజివీడు ఇన్‌చార్జి సీడీపీఓ కె. ధనలక్ష్మి అన్నారు. స్థానిక గొడుగువారిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పాలు, పండ్లు, కోడిగుడ్లు, చిరు ధాన్యాలను ప్రతి రోజూ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న బాలామృతం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. పిల్లల తల్లులకు ఇచ్చిన గ్రోత్ కార్డుల్లో పిల్లల బరువు, ఎత్తు తనిఖీ చేయించి వారి ఎత్తు, బరువు పెరిగేలా చూడాలన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

మైలవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. మైలవరం మండలంలోని పుల్లూరు, చంద్రగూడెం, అనంతవరం గ్రామాలకు చెందిన 22 మంది సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ.17,50,909 మంజూరైంది. ఈ చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మైలవరంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో లబ్ధిదారులకు అందజేశారు.

డైరీ పార్లర్‌లో చోరీ

ఆగిరిపల్లి: స్థానిక బ్రాహ్మణ వీధిలో దేశిబోయిన శ్రీనివాసరావుకు చెందిన డైరీ పార్లర్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి రూ.7 వేల నగదు, కొంత సామాగ్రిని చోరీ చేశారని షాపు యజమాని తెలిపారు. రోడ్డుపై ఉన్న సీసీ కెమేరాలను పరిశీలించగా నలుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు తెలిసిందన్నారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎక్సైజ్ సీఐ జోస్యుల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా కేంద్రీయ విద్యాలయ భవనం పనులు



కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనం

నూజివీడు: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడుకు మంజూరైన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఉద్దేశించిన తాత్కాలిక భవనం సిద్ధమవుతోంది. రెండు రోజులుగా భవనానికి రంగులు వేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

గత ప్రభుత్వంలో మంజూరు..

పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న పాఠశాల భవనం ఆవరణలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో అదనంగా పలు తరగతి గదులను నిర్మించి కేంద్రీయ విద్యాలయం మంజూరు కోసం ప్రతిపాదనలు పంపగా కేంద్ర ప్రభుత్వం విద్యాలయాన్ని మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రీయ విద్యాలయ సమితి ఉన్నతాధికారులు భవనంలో అన్ని మైనర్ పనులను పూర్తి చేసి తమకు అప్పగించాలని జిల్లా కలెక్టర్‌ను కోరగా, అధికారుల నిర్లక్ష్యాన్ని పట్టణంలోని వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లు, నాయకులు కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు శరవేగంగా పనులు చేయిస్తున్నారు. భవనాన్ని సాధ్యమైనంత త్వరగా అప్పగిస్తే ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పలుమార్లు కేంద్రీయ విద్యాలయ సమితి అధికారులు పేర్కొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



మంటలను ఆర్పే విధానాన్ని చూపుతున్న ఫైర్ సిబ్బంది

నూజివీడు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ మత్తయ్య

నూజివీడు: ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా గృహాల్లో అగ్నిప్రమాదాలను నియంత్రించవచ్చని నూజివీడు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ డి. మత్తయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బస్టాండ్, డీమార్టు, ద్వారకా థియేటర్ వద్ద అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై ప్రజలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వంట గదిలో అన్ని వైపుల నుంచి వెలుతురు, గాలి వచ్చేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాడైపోయిన గ్యాస్ ట్యూబ్‌లను వాడకూడదని, ఐఎస్‌ఐ మార్కు ఉన్న ట్యూబ్‌లనే ఉపయోగించాలని చెప్పారు. వంట చేయడం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ వద్ద ఆఫ్ చేయాలన్నారు. వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్‌లను ఉంచకూడదని చెప్పారు. దుస్తులకు నిప్పు అంటుకున్నప్పుడు కంగారుపడి ఏమాత్రం పరిగెత్తకూడదని, నేలపై పడుకుని దొర్లాలన్నారు. ఐఎస్‌ఐ మార్కు కలిగిన విద్యుత్ పరికరాలను మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులపై బయటకు వెళ్తున్నప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. ప్రతి గృహంలో కార్బన్‌డైయాక్సైడ్ సిలిండర్‌ను ఉంచుకోవాలన్నారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

జిల్లా ఎంఎస్‌ఎంఈ కో–ఆర్డినేటర్ మాదగని గురునాథ్



మాట్లాడుతున్న గురునాథ్

పటమట(విజయవాడతూర్పు): జాబ్ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాలు విద్యార్థినులు కలిగి ఉంటే మరిన్ని మెరుగైన ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఎంఎస్‌ఎంఈ కో–ఆర్డినేటర్ మాదగని గురునాథ్ అన్నారు. పటమటలోని స్టెల్లా కళాశాల్లో కృత్రిమ మేధ పవర్ అంశాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కత్రిమ మేధలో శిక్షణ వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వ కళాశాలల్లో కూడా అమలయ్యేలా తాము కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల డాక్టర్ జసింత క్వాడ్రస్, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ సూయజ్, రిసోర్స్ పర్సన్ రామ్, అధ్యాపకులు డాక్టర్ భారతి, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ స్థలం ఆక్రమణకు యత్నాలు

తిరువూరు: స్థానిక పాత బస్టాండు సెంటర్‌లోని అన్న క్యాంటీన్ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రైవేటు వ్యక్తులు మంగళవారం యత్నించారు. క్యాంటీన్ భవనానికి దక్షిణం వైపున ఉన్న పాత ప్రహరీని తొలగించి నాలుగు అడుగులకు పైగా ఆక్రమించి కొత్త గోడ నిర్మించేందుకు పనులు చేపట్టగా స్థానికులు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను నిలిపి వేయాలని కమిషనర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అన్న క్యాంటీన్ స్థలాన్ని పరిశీలించి సరిహద్దులు నిర్ధారించారు. గతంలో కూడా క్యాంటీన్ వెనుక వైపు స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

విస్సన్నపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. వేమిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని సత్తెన్నగూడెంలో ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను మంగళవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 12 వారాలుగా ఉపాధి కూలీలకు వేతన బకాయిలు పెండింగ్‌లో ఉంచడం తగదన్నారు. మండలంలో సుమారు రూ.4 కోట్ల మేర వేతనాలు రావలసి ఉందని చెప్పారు.